


# రాధాకృష్ణుల ప్రేమ కథ

పామర్తి

"నా ప్రియమైన రాధా!

ఇలా వెంటోరిస్తున్నందుకు కోపం తెచ్చుకోవు కదూ?

ఏం చేయను మరి? రోజూ కళ్ళతో నిన్ను చూస్తూనే వున్నా నిన్ను కలుసుకునేందుకు గాని, నీతో మాట్లాడేందుకు గాని ధైర్యం చాలడంలేదు. అలాగని నా ప్రేమను నాలోనే అణచుకోలేకుండాను వున్నాను

రాధా!

అసలు నాకు ఈ పేరంటేనే ఎంతో యిష్టం తెలుసా?

పేరుకు తగినట్టే నీ రూపం నన్ను ఆకట్టుకున్నదంటే అతిశయోక్తి కాదు సుమా!

అన్నట్టు నీ పేరు నాకు ఎలా తెలిసిందా అని ఆశ్చర్యపోతున్నావు కదూ? మనసుంటే మార్గమే వుండదా రాధా!

నిన్ను చూస్తూంటే - రోజంతా నిన్నే చూస్తూ అలాగే - వుండిపోవాలనిపిస్తుంది. నీ రూపంలో ఏదో మత్తు వుంది సుమా.

ఇది మొదటి లేఖ కదూ! ఇంతకంటె ఎక్కువ రాయడానికి భయంగా వుంది మరి.

ఇది ఎవడో పోకిరీ రాసిన వుత్తరం అనుకుని చింపి పడెయ్యకుండా జవాబు ఇస్తావు కదూ?

జవాబుకోసం నా అడ్రసు ఇవ్వలేదని అపార్థం చేసుకోకేం? నీ లేఖను గుడి దగ్గరున్న పారిజాత వృక్షం చెంత వుంచావంటే నాకు అందుతుంది... ఇక వుండనా మరి?

నీ

కృష్ణ."

"నా ప్రియమైన రాధా!

నాలుగురోజుల క్రితం నా మొదటి లేఖ రాసాను. నువ్వు ఒంటరిగా వుండడము చూసి దానిని నీకు అందించిన కుర్రాణ్ణి-అనుమానంగా చూస్తూ ఆశ్చర్యంతో నువ్వు నా ఉత్తరం విప్పడం నేను గమనిస్తూనే వున్నాను. బహుశా ఉత్తరంలోని సంబోధనను చూడగానే తెల్లబోయి వుంటాయి. అందుకే చివుక్కున తలెత్తి చూసావు. ఆ ఉత్తరం తెచ్చిన కుర్రాడికోసం. వాడు అక్కడ వుంటేగా! ఎప్పుడో తుర్రుమన్నాడు.

నువ్వు విస్తుపోతూ ఉత్తరం పొంతం చదవడం దూరంనుంచి నేను గమనిస్తూనే వున్నాను. ఆ తరువాత దిక్కుతోచనిదానిలా చిత్తరవోయి దిక్కులు చూడడమూ చూసాను. నీ వదనంలోని భావాలను చదవాలనుకున్నానుగాని, అప్పటికే మసకచీకట్లు ముసురుకుంటున్న కారణంగా సరిగా కనిపించలేదు మరి. ఆ లేఖను ఏం చేసి వుండేదానవోగాని, నీ కూడా వచ్చిన అమ్మాయి గుళ్ళోంచి బయటకు రావటం చూసి నువ్వు వుత్తరాన్ని గబగబా మడిచి నీ బ్లౌజులో దాచుకోవడం నాకు కనిపిస్తూనే వుంది...

నేను అల్పసంతోషిని రాధా! అందుకే లేఖను నువ్వు చింపివెయ్యకుండా భద్రంగా దాచుకున్నందుకే ఎంతో ఆనందమయిపోయింది నాకు.

కాని, రాధా!

నీ జవాబుకోసం చకోరపక్షిలా నిత్యమూ ఆశతో ఎదురుచూస్తూనే వున్నాను నేను. రోజూ గుడిబయట నిలుచుని నిన్నూ, పారిజాత వృక్షాన్ని మార్చి మార్చి చూస్తూనే వున్నాను ఆత్రంగా.

ప్చ్! ఏం లాభం?

బహుశా ఇంటికి వెళ్ళగానే నా లేఖను చింపివేసివుంటావు - నువ్వు ముక్కలు చేస్తున్నది నా హృదయాన్ని అని గ్రహించలేక! కానా?

అయినా, రాధా!

నీ మంచి జవాబులేక నిరుత్సాహం చెందినా నీమీది ప్రేమ ఈ లేఖను రాయిస్తోంది.

నా రాధా!

నెలక్రితం అనుకోకుండా నిన్ను చూడడం జరిగింది. ప్రథమ వీక్షణంలోనే నన్ను ఆకట్టుకున్నావు. నా నిరీక్షణ ఫలించింది నిన్ను చూసాక.

నువ్వు రోజూ వేణుమాధవుడి కోవెలకు వస్తూవుంటావని తెలిసి - ఆనాటి మంచీ రోజూ ఠంచనుగా గుడిదగ్గర హాజరవుతూనే వున్నాను. ఎందుకో తెలుసా?

నా రాధ సుందర వదనారవింద సందర్శనా భాగ్యం అబ్బుతుందని!

నీ నీలికన్నులలో ఏదో మ్యాజిక్ వుంది రాధా! అందుకే యింకా యింకా వాటిలోకి చూడాలన్న ఆర్తి!

డియర్ రాధా!

నెల్లాళ్ళ నుంచి రోజూ గుళ్ళో ఒకరి నొకరం చూసుకుంటూనే వున్నాం నోటితో మాట్లాడుకోకపోయినా, కంటితో చూసుకుంటూనే వున్నాం.

నిన్ను చూడగానే నా వదనంలో వెలుగు...నేను ఎదురుపడగానే కనిపించే నీ కళ్ళలోని మెరుపును నేను గుర్తించక పోలేదు.

రాధా!

నాకు ఏమనిపిస్తూంటుందో తెలుసా? మనకు తెలీకుండానే మన హృదయాలు చేరువయ్యాయని. అందుకే తెలీకుండానే ఒకరికోస మొకరం ఎదురుచూస్తూంటా మనీను!

నిజం కాదంటావా? కొంటే! నీ హృదయాన్నే అడిగి చూడు.

ఆడపిల్లవు కనుక నువ్వు బయటపడ లేకపోతున్నావు గాని, మగవాడిగా నేను ముందంజ వేసి మాత్రం ప్రయోజనం ఏముంది గనుక!

నా లేఖలకు నువ్వు జవాబిస్తే కదా!

నా రాధా!

ఇవి ఉత్త ఉత్తరాలు కావనీ నా హృదయ తంత్రులనీ-నీకెలా చెప్పేది!

నీలాల నీ కన్నులు...అప్సరలను పోలిన నీ సౌందర్యం... తేజస్సుతో వెలిగే నీ రూపము...ఇవి చాలు రాధా! నా హృదయ తంత్రులను మీటడానికి.

నిన్ను గాంచిన ప్రథమ క్షణంలోనే స్పందించిన నా మనసు - నా వశం తప్పుతోంది. నిన్ను చూడనిదే నిలువ జాలనంటోంది. నీవు లేనిదే నేను లేనంటోంది.

రాధా!

ప్లీజ్ రాధా!

ఈ ఉత్తరానికైనా జవాబిచ్చావూ? నీ మదిలో ఏముందో తెలియజెప్పవూ?

ఇదిగో అమ్మాయ్! ఇప్పుడే చెప్పే స్తున్నాను...నువ్వు జవాబివ్వకపోతే ఏంచేస్తానో తెలుసా? శరత్ నాయకిలాగ తల గోడకు కొట్టుకుని చచ్చిపోను. గుడి ముంగిట కూర్చుని సత్యాగ్రహం చేస్తాను! ఆఁ!

ఎక్కువ రాసినా చదువుకోడానికి యిబ్బంది కదూ నీకు? అందుకే ఇంతటితో ఈ ఉత్తరాన్ని ముగిస్తున్నాను.

స్వాతి చినుకులకోసం వేయినోళ్ళతో వేచిచూసే ముత్యపు చిప్పలా-నీ లేఖ కోసం వేయి కళ్ళతో ఎదిరిచూసే...

నీ

కృష్ణ."

"డియర్ కృష్ణా!

మిమ్మల్ని ఇలా పిలుస్తూంటే ఏదో వింత అనుభూతితో నా హృదయం పులకిస్తోంది. నా శరీరం ఇదమిద్ధమనలేని భావనతో చిరుకంపనకు గురౌతోంది.

ప్రేమతో నిండుకున్న మీ లేఖలు రెండూ నాకు అందాయన్న సంగతి నేరుగా చూస్తున్న మీకు-నేను వేరుగా

చెప్పాలా!

ఆరోజు-అదే మన తొలిపరిచయా నికి నాందిపలికినరోజు — మాటిమాటికీ గుర్తుకు వస్తూంటే, అమవిత్యమూ మీరు గుడిదగ్గర హాజరై నా చూపుల్లో చూపులు కలపడానికి ప్రయత్నిస్తూంటే అంత సులభంగా ఎలా మరచిపోగలను నేను!!

ఆరోజు—

గుళ్ళో అభిషేకం ఆలస్యం కావ డంతో ఇంటికి బయలుదేరేసరికి చీకటి పడింది. వెళుతూ వెళుతూ మానెచేతులు కడుక్కుందామని కోనేటిలో దిగితే కాలు జారింది. ఏం జరిగిందో గ్రహించే లోపునే ఓ మొనకవేసిన నన్ను ఎవరో వాటేసుకుని చేతులపైన ఎత్తుకుని ఒడ్డుకు చేర్చడం నాకు తెలుస్తూనే వుంది. నీళ్ళు ఎక్కువగా తాగనందున వది నిమి షాలలోనే కోలుకోగలిగాను.

మీరెవరో నేను ఎరుగును. అంతకు ముందు మిమ్మల్ని ఎప్పుడూ చూళ్ళేదు కూడాను నేను. ఎవరయితేనేం? నా ప్రాణ దాతలు మీరు. సమయానికి మీరే లేకున్నట్లయితే నా జీవితం నాటితోనే ముగిసేది.

మీకు నా కృతజ్ఞతలను ఎలా చెప్పు కోవాలో తెలియలేదు. మీ బాహువుల్లో వున్నంత సేపూ ఏదో హాయి! సిగ్గుతో, బిడియంతో నా నోరు పెకలలేదు. అందుకే మౌనంగా కళ్ళతోనే కృతజ్ఞత లను చెప్పుకున్నాను నేను. మీరు కూడా రయినా నోరు విప్పితేనా? చిరునవ్వు తోనే వీడ్కోలు చెప్పారు.

ఆ తరువాత రోజూ నేను గుడికి వచ్చే వేళకు ఆలయ ప్రాంగణంలో అబ్బాయిగారు హాజర్. ఒకరినొకరం మౌనంగా చూసుకోవడము, కళ్ళతో పలకరించుకోవడమూ తప్ప- మరో అడుగు ముందుకు వేస్తేగదా! మూగ వాళ్ళలా చూసుకోవడం నాకే తమాషాగా అనిపిస్తుంది. అప్పుడప్పుడు నవ్వు వస్తూంటుంది కూడాను.

కృష్ణా!

మీ మొదటిలేఖ అందుకున్నప్పుడు గుండె లయ తప్పిందంటే నమ్మండి. గుండెల్లో ఏదో అలజడి- శరీరంలో కంపన...

అంత ధైర్యంగా నాకు వుత్తరం రాసిన కొంటె అబ్బాయి మీరే అయి వుండాలనిపించింది. ఈ రాధకు ప్రేమ లేఖలు రాయగల ధైర్యం ఆ చిలిపి కృష్ణుడికి తప్ప ఇంకెవరికి వుంటుంది! కానా?

మీ మొదటి వుత్తరం ఇంటికి వెళ్లాక చాటుగా ఎన్నిసార్లు చదువుకున్నానో లెక్కలేదు. చదివేకొద్దీ మళ్ళీమళ్ళీ చదవాలనిపించింది- ఎంచేతో! పిచ్చి! ఆ చిన్నిలేఖలో ఓ ప్రేమ హృదయం పరచివుండడం వింతగా లేదూ?

జవాబు ఇద్దామంటే ఏదో భయం,

లజ్జా... నన్ను వట్టి ఆపేసాయి.

అన్నట్టు ఈ లేఖ ఇప్పటికే సుదీర్ఘంగా అయిపోయినట్టుంది. చూసారా, మీకు జవాబు రాయాలంటే ఏం రాయాలో, ఎలా రాయాలో తెలియ లేదు. కాని, మొదలుపెట్టగానే నాకు తెలీకుండానే కలం ఎంతదూరం తీసుకుపోయిందో!

కృష్ణా!

చాటుగా వెన్నముద్దలు మెక్కి చిలిపి కృష్ణుడికీ, సత్యాగ్రహానికీ సరిపడదు గాక పరిపడదు. అందుకే ఐద్ధకించకుండా వెంటనే జవాబు ఇస్తున్నాను—

ఎవరో వస్తున్నారు. మళ్ళీ మరో లేఖన కలుసుకుందాం.

—మీ,


రాధ."

"నా ప్రియమైన రాధా!

పారిజాత వృక్షం క్రింద, పారిజాత పుష్పాల నడుమ నీ లేఖను చూడగానే ఆనందంతో గంతు లేసింది నా మనసు. లేఖను విప్పుతూంటే గుండె లయ తప్పింది. చేతులు సన్నగా కంపించాయి. నా రాధ ఏం రాసిందోనన్న ఆతృత... 'రాధా లేదు- బాధా లేదు!' అంటూ నా ప్రేమను ఒక్క ముక్కలో త్రుంచిపారే స్తావేమో నన్న ఆందోళన...

అయితే—

ముత్యాల సరాలవంటి అక్షరాలతో ముచ్చటైన దస్తూరీతో మల్లెలహారం




కూర్చినట్లున్న నీ లేఖను చదువుతూంటే నా మనసు ఆనందడోలికలలో ఊగిపో యిందంటే నమ్ము. నా ప్రేమ ఫలించింది నా రాధ నా ప్రేమను స్వీకరించింది. నాకు ఏమను ఎక్కినంత సంబరంగా వున్నది... ఇన్నాళ్ళూ నేను వివాహం చేసుకోనిది-నీకోసమే ననిపిస్తోంది!

నా రాధా!

నీ లేఖ నా మేనికి చందన - కర్పూ రాలను పూసింది. నా ఎదలో వన్న జాజుల పరిమళాలను వెదజల్లింది...ఎన లేని సత్తువనూ, బలాన్నీ ఇచ్చింది. లోకాన్ని జయించినవాడిలా అనుభూతిని కలిగించింది.

రాధా!

నీ జవాబు రాకముందు నిరాశతో తిండి సోటిక పోలేదు. అఫ్‌కోర్స్! ఇప్పుడూ పోలేదనుకో — ఆనందాతి శయంతో!

ఏనాటికానాడే నిన్ను పలకరించాలనీ నీతో నాలుగుమాటలు ఆడాలనీ, నా తపన తీర్చుకోవాలనీ ఎంతో తహతహగా వుంటుంది. కాని, నిన్ను చూడగానే ధైర్యం ఇంకిపోతుంటుంది. మృదుగంభీరమైన నీ వదనంలోకి చూడగానే అంతవరకూ వేసుకున్న రిహార్సల్ అంతా వృధా అయిపోతుంది. నీ నీలాల కన్నుల్లోకి చూస్తూ అలాగే నిలుచుండిపోవాలనిపిస్తుంది. సత్యతే గుర్తుకు రానట్లయితే ఆలా నీ కళ్ళలోకి చూస్తూ ఎంతసేపు వుండిపోయేవాడినో!

నా అందాల రాధా!

నా మనసంతా నీ మంజుల మోహన రూపంతో నిండిపోయి వుంది. అహర్నిశలూ నీ తలపులే... నీ కళ్ళ వూసులే...

రాధా!

నీతో ఎన్నెన్నో చెప్పాలనీ, నా ఎద వూసులను నీ చెవిలో గుసగుసలాడాలనీ ఆరాటం...

ప్లీజ్! నాతో మాటాడవూ?

జాబు రాస్తావు కదూ?

—నీ
కృష్ణ."

"నా ప్రియమైన కృష్ణా!

నీ జాబు అందింది. చదువుతూంటే గులాబీల పరిమళాలు వెదజల్లినట్లుంది మనసంతా మత్తులో నిండిపోయింది.

నీ ఉత్తరంలో ఏదో మాయవున్నది నీ అక్షరాలలో మత్తువున్నది. అందుకే నా ప్రమేయం లేకుండానే నా మనసంతా పరవశంతో పురివిప్పి ఆడుతున్నది. నీ వశమైపోతున్నది.

నా అవస్థ నాకే వింతగా తోస్తోంది. నేనెవర్ని? నీ వెవరు? ఇదెక్కడి సంబంధం! ఏమిటీ అనుబంధం!! ఏనాటిదీ బంధం!?

నెల క్రితంవరకు నే నెవరో, నీ వెవరో!... అయినా, ఇంతలోనే ఎంత మార్పు!?

నీ గుండెలలో అలజడి లేపానన్నావు. కాని, నా ఎదలో పులకిపాటును రెకెత్తించింది నువ్వు కాదూ? కలలో కూడా వూహించని విధంగా నా జీవితాన్ని మలుపు తిప్పుతూన్న కొంటె కృష్ణుడివి నీవు కాదూ?... ఈ రాధకు ఓ కృష్ణుడు ఎదురవుతాడనీ, ఇలా అల్లరిచేస్తాడనీ-కలలో, మెలకువలో అలజడి లేపిస్తాడనీ ఎన్నడయినా వూహించానా!? కృష్ణా!

నీ ప్రేమను అందుకోగలనా అన్న ఆందోళన... నీ అనురాగాన్ని, అభిమానాన్ని కాదనలేని అశక్తత... అహర్నిశలూ నన్ను సతమతం చేస్తున్నాయి.

మానసచోరా!

ప్రశాంత నిర్మల ఝరిని కల్లోల పరచడం తగునా! అందుకు ఈ రాధే దొరికిందా నీకు! నీ మురళీ రవానికి పరవశించిపోవడం తప్ప, ఈ పిచ్చి రాధ నీకు ఏమివ్వగలదు? ఇంకా నా దగ్గర ఏమున్నదని నీకు ఇచ్చేందుకు?

ఏమి చూసి- నాలో ఏమిచూసి ప్రేమిస్తున్నావు నన్ను? అలనాటి రాధ వున్నతురాలు. కాని, ఈ రాధ వొట్టి మట్టిబొమ్మ! వొట్టిపోయిన వట్టి మనిషి! పరులచాటున బ్రతుకీడ్చే అర్భకురాలు... ఈ రాధతో ప్రేమను పంచుకుని నువ్వేమి వొరిగించుకోగలవు?... అదిసరేగాని, కృష్ణా!

నాలో ఓ సందేహం మెదులుతోంది. నిత్యమూ క్రమం తప్పకుండా గుళ్ళో హాజరవుతావే- లోపలికి ఎందుకు వెళ్ళవు నువ్వు? ఆ వేణుమాధవుణ్ణి నువ్వు దర్శించుకున్న సందర్భం ఒక్కనాడూ తారసపడలేదనుకో- ఆ గోపాలకృష్ణుడు నేనే కదా అన్న అతిశయమా? లేక, ఈ రాధ ధ్యాసలోపడి ఆ మురళీధరుణ్ణే విస్మరిస్తున్నావా? ఇదే నిజమయితే- ఆ పాపం చుట్టుకునేది నాకే సుమా!

కృష్ణా!

ఎంత రాసినా తనివితీరడం లేదు. ఇంకా ఇంకా రాయాలనే వుంటుంది. నా మనసు నీ ముందు పరచాలనే వుంటుంది. నా ఎదలోని బొద నీ హృదయానికి ఎక్కించాలని వుంటుంది.

అతి వెగటు పుట్టిస్తుందంటారుకదూ? అందుకే ఇప్పటికి ఇంతటిలో ఆపివేస్తున్నాను. సరేనా?...

—నీ,

రాధ."

"నా ప్రియమైన రాధా!

పారిజాత పరిమళాలను మోసుకు వచ్చిన నీ మనోలేఖను చూడగానే నా మనసుకు మంచిగంధపు లేపనంలా అనిపించింది. మేఘ శకలాలను తిలకించిన నెమలిలా పురివిప్పి నాట్యంచేసింది.

అన్నట్టు- నేను గుడి లోపలికి ఎందుకు వెళ్ళడంలేదని కదూ అడిగావు? ఏం చెప్పమంటావు రాధా! ఆదినుంచీ నాకు గుడికివెళ్ళే అలవాటు లేదాయె. అలాగని నన్ను నాస్తికుడిగా జమకట్టేవు సుమా!

నిన్ను చూసినప్పటినుంచీ గుడికి వెళ్ళడం నిత్యకృత్య మయిపోయింది. ఏం చేయమంటావ్ మరి- నా ఆరాధ్య దేవతను దర్శించుకోవాలంటే అది ఒక్కటేగా మార్గం!

అయితే మొదటిరోజున అక్కడ ఎందుకు వున్నావ్ అని అడగొచ్చును నువ్వు- ఆ రోజు ఎందుకో గుడి దగ్గర వున్న కోనేటిగట్టువైపు షికారుకు వెళ్ళాలనిపించింది. ఎందుకో ఏమిటో, బహుశా మన కలయికకోసమే దేవుడు ఎన్నడూ లేనిది ఆనాడు నన్ను అక్కడికి తీసుకు వెళ్ళి వుంటాడు! కాదా? కొన్నికొన్ని అలాగే, మనకు తెలియకుండానే జరిగిపోతాయంటారు. విధి వైచిత్ర్యం అంటే ఇదే కావచ్చు!

రాధా!

ఈ మధ్య నేను రోజూ గుడికి వెళ్ళడం తెలిసి మా వదిన నన్ను ఎంత ఏడిపిస్తుందో తెలుసా? 'ఏ అమ్మాయి

అయినా కనిపించిందా ఏమిటయ్యా హఠాత్తుగా గుడివైపు గాలి మళ్ళింది' అంటూ పరిహాసం పట్టిస్తోంది వదిన పలుకులకు నేను ముసిముసి నవ్వులు నవ్వుకుంటూంటే అన్నయ్య నావంక వింతగా చూస్తూ నవ్వుకోవడం నాకు సిగ్గు వేస్తోందనుకో.

నా రాధ విషయం వదినకు, అన్నయ్యకు చెప్పివేద్దామా అనిపిస్తూంటుంది ఒక్కోసారి. కాని, నీ అభిమతం పూర్తిగా తెలుసుకోకుండానే తొందర పడకూడదని ఊరుకుంటున్నాను.

నా రాధా!

పెళ్ళిచేసుకొమ్మని అన్నయ్య. వదిన చెవిని ఇల్లు కట్టుకుని పోరినా పెళ్ళి వొద్దంటూ దాటవేస్తూ వచ్చాను కాని, నిన్ను చూసాక తెలిసివచ్చింది— జీవితంలో ఏం పోగొట్టుకున్నానో! ఒక్కసారిగా ఎక్కడలేని ఒంటరి తనమూ ముంచుకు వచ్చేసింది నాకు. నా బ్రతుక్కి ఓ తోడు కావాలని, నా మనసు విప్పుకునేందుకు ఓ సాటి హృదయం అవసరమని గాఢంగా అనిపిస్తోంది... అందుకే, రాధా! నిన్ను అర్థిస్తున్నాను—

రాధా!

ప్లీజ్! నాకు తోడు కాగలవా? నాతో బ్రతుకును పంచుకోగలవా!!

రాధా!

నా మనసు కోరేది నీవంటి స్త్రీనేనని అనిపిస్తోంది. మనం జీవితాంతమూ కలిసివుంటే చాలు. అంతకుమించి మరేమీ కోరను నేను. నీ బరువు, బాధ్యతలు నావి. మన విషయంలో మీ ఇంట్లో ఒప్పుకోరేమోనని భయపడుతున్నావా?— ఇంటిలో మీ వాళ్ళు నిన్ను చూసే తీరును నేను ఎరుగుదును. నాకెలా తెలిసింది అనుకుంటున్నావా? నా ప్రాణంలో ప్రాణం— నీ వివరాలు తెలుసుకోకుండా ఎలా వుండగలను? అకారణంగా అను నిత్యమూ నీ హృదయాన్ని గాయ పరచె ఆ మనుషుల మధ్య వుండకపోతే నేం? ఇంట్లో లేని శాంతిని గుళ్లో ఎంత కాలమని వెదుక్కుంటావు?... లోకం హర్షించదేమోనని సంశయిస్తున్నావా? బాధపడుతూన్న నన్ను ఓదార్చేందుకు ఈ లోకం ఏమిచేసింది కనుక— మరో రెండు సమిధలు వేయడం తప్ప!

అందుకే రాధా! నీ మనసును అర్థం చేసుకున్న, నిన్ను ఆరాధిస్తోన్న ఈ కృష్ణుడివద్దకు వచ్చేయ్— కుళ్ళు సమాజం దీన్ని లేచిపోవడం అంటుందని బెంగ పడకు. ఇది రెండు ప్రేమైకహృదయాల సమాగమం అనీ, ఓ ప్రేమజంట అపూర్వ కలయిక అనీ అర్థంచేసుకునే సహృదయమూ, సంస్కారమూ ఈ సమాజానికి ఎక్కడిది!?

నా రాధా!

బాగా ఆలోచించుకో. నీకు కావలసిందేమిటో నువ్వే వెదుక్కోవాలి తప్ప— అర్థంలేని సెంటిమెంట్లతో నిన్ను నువ్వు

వంచించుకోకు.

ఏరోజుకారోజే నిన్ను పలుకరించా అని పువ్విళ్ళూరుతూ వుంటాను. కాని, ఏం చేయను? ఆ అమ్మాయి అస్తమాను నిన్నే అంటిపెట్టుకుని వుంటుందాయె. ఆమె ముందు పలుకరించి నిన్ను ఇబ్బందికి గురిచేయడం ఇష్టంలేదు.

మన పరిచయానికి మూణ్ణెల్ల వయసు దాటినా, మనం యింతవరకూ ఒక్క ముక్క కూడా మాట్లాడుకోలేదంటే విచిత్రంగా లేదూ?

అయినా నా పిచ్చిగాని, రాధా! పెదవి కదపకపోతేనేం- కళ్ళతో ఊసులాడుకుంటున్నాం, చాలదూ? మన హృదయాలు మూగబాసలు చేసుకుంటున్నాయి, సరి కాదూ?... పైగా, మన హృదయాలు రెండూ లేఖలలోనే నిండుకుంటున్నాయిగా, ఇక మాట్లాడడానికి ఏముంది అంటావా? అదీ నిజమే మరి!...

రాధా!

నీకు దూరంగా ఇక వుండలేనని పిస్తోంది. అనుక్షణం నీ సాన్నిధ్యాన్ని కోరుతోంది నా మనసు నీతోటిదే లోకం అనిపిస్తోంది ఎప్పుడూ నీ తలపులతోనే అన్యమనస్కంగా వుంటూన్న నన్ను ఆటలు పట్టిస్తోంది వదిన. 'ఏ రాకుమార్తె నీ ఊహాలలో మెదులుతోందయ్యా?- ఎప్పుడు చూసినా ఊహాల వుయ్యాలలో వూగుతున్నావు?' అంటూ ఏడిపిస్తోంది. నిజం చెప్పాలంటే సిగ్గేస్తోంది నాకు- ఇన్నాళ్ళకు మా బోధలలోని సారం అర్థమయిందన్నమాట అంటూ ఆవిడ దెప్పిపొడుస్తుందేమోనని.

డియర్ రాధా!

త్వరలోనే నీ నిర్ణయాన్ని తెలియ పరుస్తావు కదూ? రాధ నిర్ణయంపైనే కృష్ణుని భవిష్యత్తు నిలబడి వున్నదని మరిచిపోవు కదూ?

ఇక వుండనా మరి-?

—నీ
కృష్ణ."

నా కృష్ణా!

ఇన్నాళ్ళూ నిద్రాణమైవున్న నాలోని ప్రేమతృష్ణ నీ పరిచయ భాగ్యంతో మేల్కొంది. ఎప్పుడెప్పుడు నీ ముందు వాలదామా అని నా మనసు వేగిరపడుతోంది. 'నావాళ్ళు ఏమనుకున్నా పరవా లేదు. లోకం ఏమైపోయినా బాధలేదు. నా జీవితం నేను గడపాలి' అన్న తెగింపు ధైర్యమూ వచ్చేస్తున్నాయి.

డియర్ కృష్ణా!

ఇక ఆలోచించే ఓపికా, శక్తి నాకు లేవు. నిర్ణయాన్ని నీకే వదిలేస్తున్నాను. రాధను అర్థంచేసుకోగలిగింది కృష్ణుడు ఒక్కడే! నాకది చాలు. లోకంతో పని లేదు.

నీ లేఖకు ఎదురుచూసే —

— నీ
రాధ."

• • •

"నా ప్రియమైన రాధా!

నీ లేఖ నామీద పన్నీటిజల్లు చిలికించింది. నీ నిర్ణయం ఈ ప్రపంచానికే పట్టం కట్టించుకున్న అనుభూతిని కలిగిస్తోంది నాకు. నా ఆనందాన్ని అక్షరాలలో మలచలేకపోతున్నాను.

నా రాధా!

నీ అనుమతి లభించగానే ఆలస్యం చేయకుండా మన విషయం అన్నయ్యతోను, వదినతోనూ చెప్పేశాను. మొదట ఆశ్చర్యంతో తెల్లబోయినా, ఆలస్యంగానైనా ఓ మంచి నిర్ణయం తీసుకున్నందుకు నన్నెంతో అభినందించారు వాళ్ళు. మనల్ని తమతోనే వుండిపొమ్మన్నారు.

కాని, రాధా!

మన ప్రేమసామ్రాజ్యంలో ఇతరులకు తావులేదు. మన అనురాగ మందిరంలో మన మిద్దరమే వుండాలి-నీ సాంగత్యంలో నేను, నా సన్నిధిలో నువ్వు-ఏకాంతరిగా మనలోకం మనదే నన్నట్టు వుండాలి. అందుకే అన్నయ్యతో చెప్పేశాను- నా రాధతో నేను వేరుగా వుంటానని. అన్నయ్య వదిన ఎంతో సంస్కారవంతులు. నా ప్రతిపాదనకు ఎదురుచెప్ప లేదు.

రాధా!

అన్నయ్య వచ్చి మీవాళ్ళతో మాట్లాడుతానన్నాడు మన విషయం. కాని, నేనే వొద్దన్నాను- మీవాళ్ళ సంగతి ఎరిగుండీ నిన్ను ఇబ్బందులకు గురిచెయ్యటం ఇష్టంలేక.

అందుకే, రాధా! రేపు సాయంత్రం-నీ నిర్ణయాన్ని ఓ చీటిలో రాసిపెట్టేసి ఇంటిమంచి వచ్చేయ్. గుళ్ళో పారిజాత వృక్షం చెంత కలుసుకుందాం...మిగతా విషయాలు నేరులో మాట్లాడుకుందాం...

అధైర్యం చెయ్యకుండా తప్పక వస్తావు కదూ!...నీకోసం ఎదురుచూసే

—నీ

కృష్ణ."

ఆ సాయంత్రం—

చిరుచీకట్లు కమ్ముకుంటూన్న వేళ...

వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో...

పారిజాత వృక్షం క్రింద...

రాధ...

కృష్ణ....

మౌనంగా ఒకరి కన్నులలోకి ఒకరు చూసుకుంటూ వుండిపోయారు.

కృష్ణ కళ్ళలో ప్రేమతృష్ణ.

రాగరంజితమయిన రాధ నీలి కన్నుల్లో అనురాగ గంగ.

అతని కళ్ళలో ఆరాటం.

ఆమె కన్నుల్లో ఆర్తి.

అతని వదనంలో చిరుచెమటలు.

ఆమె అధరాలలో కంపన.

అతని హృదయంలో ప్రేమఘోష.

ఆమె గుండెల్లో చిరుమువ్వల మరు సవ్వడి.

"రాధా!" మొదటిసారిగా నోరు



యువ




విప్పాడు కృష్ణ.

"కృష్ణా!" రాధ తమకంతో పెదవి కదిపింది.

కన్నుల్లో అనురాగ వల్లరులు.

వారి గుండెల్లో ప్రేమఝురులు.

"రాధా!" అంటూ చేతులు చాచాడు అతను.

"కృష్ణా!" అంటూ అతని గుండెల్లో వొదిగిపోయింది ఆమె.

అదే క్షణంలో —

వేణుమాధవుడి ఆలయంలో జయ గంటలు మ్రోగాయి.

"రాధా!" అంటూ ఆనందోద్వేగాలతో కౌగిలి బిగించాడతను.

"కృష్ణా!" అంటూ తృప్తితో కన్నులు మూసుకుని తల అతని వక్షానికి ఆనించిందామె.

అన్ని వేళలనుంచీ కళ్ళతో చూసుకుంటున్నా.... హృదయాలతో భాషించుకుంటున్నా......శ్వాసలలో కలుసుకుంటున్నా...వాళ్ళు పెదవి విప్పి మాట్లాడుకుంటున్నది అదే ప్రథమం!

"పద రాధా! మన కొత్త యింటికి వెళదాం" అన్నాడు కృష్ణ, ఆమె చుబుకం పట్టి తలెత్తి ఆమె కన్నుల్లోకి చిలిపిగా చూస్తూ.

నవ్విందామె. ఆ నవ్వులో సిగ్గు, సంతృప్తి, ఆనందమూ, అనురాగమూ- అన్నీ కలగాపులగమయ్యాయి.

"కృష్ణా! ఈ రాధ నీది..." అంది ఆమె, తన్మయంతో కన్నులు అరమోడుస్తూ.

"ఈ కృష్ణుడు ఈ క్షణంకొరకే వేచియున్నాడు రాధా!" అంటూ ఆమె కన్నులపైన సుతారంగా ముద్దుపెట్టుకున్నాడు అతను.

"కృష్ణా! ఈ వయసులో మన ప్రేమ హాస్యాస్పదమవుతుందేమోనన్న సంశయమే ఇన్నాళ్ళూ నన్ను పట్టి వుంచింది" అని ఆమె అంటే-

"రాధా! ప్రేమ కేవలం శారీరకమే కాదు. మానసికమైనది...ఒకసారి ఆ రాధాకృష్ణుల ప్రణయగాథను తలంపుకు తెచ్చుకో. నీకే తెలుస్తుంది-వారిది కేవలమయిన శారీరక సంబంధం కాదనీ, మాలిన్యం అంటని మనోవ్యవస్థ అనీను. పవిత్రమయిన ఓ ప్రణయకావ్యం వారిది, అలాగే మన ప్రేమ కూడా కుత్సిత శరీరవాంఛలకు ఆలంబనం కాదనీ, పవిత్రమయిన మనోస్థితి అనీ, రెండు మూగహృదయాల అనురాగ కలయిక అనీ గ్రహించడానికి సంస్కారం అవసరం రాధా! సంస్కారహీనులు ఏం కూసినా మనం పట్టించుకోనవసరంలేదు" అంటూ విపులీకరించాడు అతను.

"పద వెళదాం" అంటూ ఆమెను పట్టుకుని మృదువుగా నడిపించాడు.

జీవితపు చరమాంకంలో తగినతోడు సంపాదించుకున్న ఆ ప్రేమైకజంట-

కాల వితంతువు అయిన యాభై ఏళ్ళ రాధ...బ్రహ్మచారి అయిన యాభై అయిదేళ్ళ కృష్ణాను!

అనురాగంతో చేతిలో చేయివేసుకుని ఆనందంగా అడుగులు వేసుకుంటూ నూతన జీవితంలో అడుగుపెడుతూంటే-

పారిజాత వృక్షం సంతోషంతో పులకించింది

పూలన్నీ రాలి ఆ ప్రేమ జంటకు తలంబ్రాలు పోసాయి.

* * *